వాటర్ కూలర్లను ప్రారంభించిన జేసీ ధ్యానచంద్ర

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య గల బైపాస్ రోడ్డులోని దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర సోమవారం సందర్శించారు. శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ద్వారా దాతలు సమకూర్చిన రూ.70 వేల విలువైన రెండు వాటర్ కూలర్లను ఆయన ప్రారంభించారు. అక్షయ పాత్ర ప్రాంగణంలోని ఆవుదూడల ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. అక్షయ పాత్ర ద్వారా నిర్వహిస్తున్న యాగాలు, అన్నదానాలు, గోశాల సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, గోసేవకులు గొవ్వాల అచ్యుత రామయ్య, తూము వరప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టండి

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలంటూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ఎత్తేయాలని చూస్తుందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీ ధ్యానచంద్రకు అందజేశారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 89 మందికి ఉద్యోగాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో పలు జాతీయ బహుళ జాతి కంపెనీలు సోమవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 89 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. సినర్జీన్ ఫార్మా, హెటిరో డ్రగ్స్, దివీస్ లేబొరేటరీస్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టాయి. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ



రంగాపురంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈఈ రామ్‌గోపాల్

ఐ.పోలవరం: మండలంలోని పలు గ్రామాల్లో సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఐ.పోలవరం మెయిన్ రోడ్‌లో ఉన్న కాటన్ విగ్రహం వద్ద దంగుడు బియ్యం నాగమోహనరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేశనకుర్రుపాలెంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు తదితరులు కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. మురమళ్ల, ఎదుర్లంక, టి.కొత్తపల్లి, జి.వేమవరం తదితర గ్రామాల్లో ఉన్న కాటన్ విగ్రహానికి నాయకులు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాళ్లరేవు: ఉభయ గోదావరి జిల్లాలు సస్యశ్యామలం అయ్యేందుకు కాటన్ మహాశయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. సోమవారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమానికి శివన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరై కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, వల్లు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు కాటన్

అమలాపురం రూరల్: రంగాపురం జలవనరుల శాఖ ఈఈ కార్యాలయం వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ డీవీ రామ్‌గోపాల్, డీఈఈ శ్రీనివాస్‌లు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటన్ మహాశయుడి వల్లే డెల్టాలో ప్రజలు తిండి గింజలు తింటున్నారని కొనియాడారు.

సచివాలయాలతోనే గ్రామాల్లో అభివృద్ధి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- నంగవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



నంగవరంలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను స్థానిక మహిళకు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన సచివాలయాలతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని నంగవరం గ్రామంలో ఏర్పాటుచేసిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం ఆయన తనయుడు శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన నూతన సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలన్నవి దేశానికే ఆదర్శంగా నిలిచాయలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి బాబి, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మానే శ్రీను, గుండుమోగుల వెంకట నారాయణ, శీలం సూరిబాబు, లంక సత్యనారాయణ, పరమట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గోడిలో రక్తదానం



విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పుట్టినరోజు సందర్భంగా బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడిలోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్సీ అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అందజేశారు. అనంతరం అమలాపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పాము కాటుతో మహిళ మృతి



మృతురాలు పద్మ(ఫైల్)

ఉప్పలగుప్తం: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన ఉప్పలగుప్తం గ్రామం చీకట్లపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీకట్లపాలేనికి చెందిన సుందరనీడి పద్మ(28) ఆదివారం రాత్రి తన నివాసంలో నేలపై నిద్రించింది. ఆమె లేచి చూసేసరికి చేతికి గాయమై ఉండడం, పక్కనే కప్ప చనిపోయి పడి ఉండడంతో అది పాముకాటని గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పడంతో హుటాహుటీన ఉప్పలగుప్తం పీహెచ్‌సీకి తరలించారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో 108 కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేయగా స్థానిక 108 మరమ్మతులకు గురైందని, పక్క మండలం నుంచి వాహనం వస్తుందని బదులిచ్చారు. వాహనం రాక ఆలస్యమవుతుండడంతో అందుబాటులో ఉన్న కారులో అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. పీహెచ్‌సీలో రాత్రి సమయంలో వైద్య సిబ్బందెవరూ అందుబాటులో ఉండడం లేదని, సమయానికి ప్రథమ చికిత్స అందించి ఉంటే పద్మ ప్రాణాలు దక్కేవని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి వైద్యాధికారి ఎల్.నాగార్జునను వివరణ కోరగా సిబ్బంది గదిలో ఏసీ పనిచేయక లోపల నిద్రిస్తున్నారని, దానివల్ల వినబడకపోయి ఉండొచ్చని బదులిచ్చారు.

పోలేరమ్మకు బంగారు చెవి బుట్టలు బహూకరణ



అమ్మవారిని దర్శించుకుంటున్న దాత మామిళ్లపల్లి దొరబాబు దంపతులు

అమలాపురం రూరల్: సమనస గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి మామిళ్లపల్లి దొరబాబు, సూర్యప్రసన్న దంపతులు 12 గ్రాముల బంగారంతో తయారు చేయించిన చెవి బుట్టలు సోమవారం బహూకరించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వాటిని అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మంచిగంటి మాచరరావు, మామిళ్లపల్లి సత్తిబాబు, గంధం శ్రీనివాస్, బోదూరి సుబ్బారావు, కొరసాల కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

19న మధుమేహవ్యాధి రోగులకు సదస్సు

యానాం: యానాం రీజియన్‌లో చక్కెర వ్యాధితో బాధపడుతున్న రోగులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19వ తేదీ శుక్రవారం స్థానిక జీజీహెచ్ ఓపీడీ విభాగంలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు యానాం జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవస్థానం భూమి ఆక్రమణపై ఫిర్యాదు

యానాం: దరియాలతిప్పలో భూసమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం భూమిని ఆక్రమణ నుంచి విడిపించాలని కోరుతూ సోమవారం స్థానిక బాలయోగికోలనీ, దరియాలతిప్ప, సీతారామనగర్ గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. వేంకటేశ్వరస్వామికి చెందిన సుమారు మూడెకరాల భూమిని మల్లాడి సత్తిబాబు అనే వ్యక్తి ఆక్రమించి నకిలీ పవర్ ఆఫ్ అటార్నీ సంపాదించాడని, చమురు సంస్థలకు లీజుకిచ్చి లబ్ధి పొందుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో చలివేంద్రం

అమలాపురం రూరల్: వేసవి ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ప్రజల దాహం తీర్చడానికి చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ దంపతులు జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.

టీడీపీ పాదయాత్ర

ముమ్మిడివరం: నారా లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సోమవారం ముమ్మిడివరంలోని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి గున్నేపల్లి సత్తెమ్మ తల్లి గుడి వరకూ పాదయాత్ర నిర్వహించారు.

దివ్యాంగుల నిరసన

ముమ్మిడివరం: దివ్యాంగుల విషయంలో వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారంటూ నిరసిస్తూ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ యడ్ల రాంబాబుకు నలమాటి లంకరాజు తదితరులు అందజేశారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్ష



బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీసెట్ ప్రవేశపరీక్షకు హాజరైన విద్యార్థులు

అమలాపురం రూరల్: ఇంజినీరింగ్‌లో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీఈఏపీసెట్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పరీక్ష జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన 175 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 168 మంది హాజరైనట్లు కోఆర్డినేటర్ అడబాల కుమార్, ఏవో జక్కం కృష్ణారావులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



భద్రతా చర్యలపై సీఐకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: మత్స్యకార భరోసా పంపిణీ సమావేశ వేదిక ఏర్పాట్లను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు, మత్స్యశాఖ జేడీ షేక్ అహ్మద్ ఆలీలతో కార్యక్రమ నిర్వహణ గురించి చర్చించారు. కాట్రేనికోనలో సభా వేదిక వద్ద ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకార భరోసాతో పాటు 23 వేల మంది లబ్ధిదారులకు ఓఎన్‌జీసీ మూడో విడత నష్ట పరిహారంగా రూ.108 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కడంతో లబ్ధిదారుల ఖాతాలకు జమవుతాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఐ.పోలవరం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతయింజరం వద్ద రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ భవనానికి సోమవారం ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, కొండేపూడి కృపావరప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర 'బులియన్' కోశాధికారి అనిల్‌కు సత్కారం



అనిల్‌కుమార్ జైన్‌ను అభినందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంగారు, వెండి, డైమండ్స్ మర్చంట్స్(బులియన్) అసోసియేషన్ కోశాధికారిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన అమలాపురానికి చెందిన జ్యూయలరీ వ్యాపారి అనిల్‌కుమార్ జైన్‌ను స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. స్థానిక కల్వకొలనువీధిలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కట్టోజు సన్యాసిదాసు, యెండూరి నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ తదితరులు ఆయనను అభినందించారు.